క్లుప్తంగా

నిండుకుండలా.. పెద్ద చెరువు



తాండూరు రూరల్: నీటితో కళకళలాడుతున్న పెద్ద చెరువు

తాండూరు రూరల్: గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి కళకళలాడుతున్నాయి. తాండూరు మండలం చెంగోల్ గ్రామశివారులోని పెద్ద చెరువు వర్షం నీరు చేరడంతో నిండుకుండలా మారింది. చెరువుకట్ట కింద దాదాపు రెండు వందల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయనున్నారు. చెరువు నిండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి



డీఆర్‌డీఓ పీడీకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పరిగి: ఉపాధిహామీలో అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలో ఉపాధిహామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లయ్య పనులు చేయకున్న కూలీలకు పని చేసినట్లు హాజరు వేసి డబ్బులు కాజేస్తున్నారన్నారని మండిపడ్డారు. గతంలో కూడా సొంత కుటుంబ సభ్యులు పని చేయకుండా వారికి హాజరు వేసి అవినీతి పాల్పడ్డారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులు హెచ్చరించి వదిలేశారన్నారు. విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విధులకు మాత్రమే విరమణ

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సునీతారెడ్డి



మోమిన్‌పేటలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

మోమిన్‌పేట: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గౌరవప్రదమైనదని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చీమల్‌దరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై శాలువాతో సత్కరించి మాట్లాడారు. విధులకు మాత్రమే పదవి విరమణ అని ఇంకా ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. సమాజాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

కొడంగల్ రూరల్ : వ్యాపార కేంద్రాలు, ఇళ్ల ఎదుట సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎంతో మేలు జరుగుతుందని హెడ్ కానిస్టేబుల్ శివ రాములుగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రి సమయంలో దొంగలు సంచరిస్తున్న సమయంలో గుర్తించవచ్చన్నారు. దొంగతనాల నివారణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తుల సంచారాన్ని సీసీ కెమెరాల ఏర్పాటుతో ముందుగానే కనిపెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దైవ చింతనతో ప్రశాంతత



పోచమ్మతల్లిని దర్శించుకుంటున్న రాజిరెడ్డి

దోమ : దైవచింతనను ప్రతి ఒక్కరూ అలర్చుకోవాలని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగన్‌పల్లిలో పోచమ్మ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్యతో కలసి పోచమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా భక్తులు బోనాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు శేషాద్రి రావు, గోపాల్, మొగులయ్య పాల్గొన్నారు.

అరకొర వసతుల్లో అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.. సరైన వసతులు లేక పిల్లలు, బాలింతలు, గర్భిణులు బాధపడుతున్నారు. చాలా కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవు. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొన్ని కేంద్రాలు కొనసాగుతున్నాయి.

- అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్న వైనం
- ఆట వస్తువులు లేక చిన్నారులకు అందని పాటల బోధన
- పౌష్టికాహారంపై కొరవడిన పర్యవేక్షణ



ఊరగుంటతండాలోని అంగన్‌వాడీ కేంద్రం

దౌల్తాబాద్: చిన్నారులకు బాల్యం నుంచే ఆటపాటలతో చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీలను ఏర్పాటు చేసింది. అయితే, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో సమస్యలు వెంటాడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బోధన, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీని పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సీడీపీఓ, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన కేంద్రాలను తనిఖీ చేయడంలో అలసత్వం వహిస్తుండడంతో అర్హులకు నష్టం జరుగుతుందని ఆయా గ్రామాల లబ్ధిదారులు వాపోతున్నారు. అయితే, మండలంలో 33 పంచాయతీల్లో 68 కేంద్రాలకు గాను ఇద్దరు సూపర్‌వైజర్లు మాత్రమే ఉండడంతో పర్యవేక్షణ పూర్తిగా లేదంటున్నారు. అంతేకాకుండా చాలా చోట్ల టీచర్లు సమయపాలన పాటించడంలేదు.. కొన్ని చోట్ల సిబ్బంది కొరతతో కేంద్రాలను తూతూమంత్రంగా నడిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆట వస్తువులేవి..

పిల్లలకు ఆటపాటలతో విద్య అందించాల్సి ఉండగా పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులే లేవు. జారుడు బల్లలు తదితర పరికరాలను ప్రభుత్వం ఇవాల్సి ఉంటుంది. ఆట వస్తువులు ఇవ్వకపోవడంతో కేంద్రాల్లో పిల్లలను ఆడించలేకపోతున్నారు. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు సొంత డబ్బులతో ఆట వస్తువులు కొనుగోలు చేసి పిల్లలతో ఆటలు ఆడిస్తున్నారు.

మండలంలో ఇలా...

మండలంలో రెండు సెక్టార్ల పరిధిలో 68 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 3మినీ, 65 ప్రధాన అంగన్‌వాడీలు ఉన్నాయి. వీటిలో 16 కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి సరైన స్థలం కూడా లేదు. ఒకవేళ ఆటస్థలం ఉన్నా ఆట వస్తువుల కొరతతో ఆటలకు దూరంగా ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

“ చిన్న చిన్న ఆటవస్తువులు ఉన్నాయి

కేంద్రాలకు ఇటీవల కొన్ని ఆటవస్తువులు వచ్చాయి. కొన్ని కేంద్రాలు తీసుకెళ్లలేదు. జారుడు బల్లలు వంటి పరికరాలు ప్రభుత్వం నుంచే రాలేదు. ఉన్నవాటితోనే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పిస్తున్నారు. అంగన్‌వాడీలను పర్యవేక్షణ చేస్తున్నాం.

–మంజుల, సూపర్‌వైజర్

పానాది బాటను కబ్జా నుంచి రక్షించండి



యాలాల: తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

యాలాల: రైతుల పొలాలకు వెళ్లే పానాది బాటను కబ్జా కోరు నుంచి రక్షించాలని ఏఎంసీ మాజీ డైరెక్టర్లు ఆశన్న, మంత్రి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ రైతులతో కలిసి బుధవారం యాలాల తహసీల్దార్ మునీరొద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ.. నగరానికి చెందిన చైతన్య క్రిష్ణ అనే వ్యక్తి గ్రామ శివారులో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. గ్రామానికి చెందిన కొందరు రైతులకు సంబంధించిన అసైన్డ్, సీలింగ్ భూములకు వెళ్లేందుకు ఉన్న పానాది బాట(నక్షబాట)ను కబ్జా చేసి ఫెన్సింగ్ వేసుకున్నాడు. సర్వే నంబర్లు 50, 52, 70,71, 72,49 సరిహద్దు రాళ్లను సైతం బలవంతంగా తొలగించాడని పేర్కొన్నారు. దీంతో పొలాలకు వెళ్లే రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని తహసీల్దార్‌కు వివరించారు. ఈ విషయంలో కబ్జాకు గురైన భూమిని సర్వే చేయించి, నక్షబాటను సంరక్షించి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకుడు ఖాసీం, బీఆర్‌ఎస్ నాయకుడు క్రిష్ణ, మంత్రి మొగులప్ప, మల్లేశం, మొగులప్ప, రాంచంద్రి, మొగులమ్మ, సత్యమ్మ, ఖాసీం తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సులువు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు చేసిన డాక్టర్ సుజల

డాక్టర్ సుజల

మోమిన్‌పేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరుపుకోవాలని డాక్టర్ సుజల సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిల్లో కాన్పులకు వస్తే.. వీలైంత వరకు నార్మల్ డెలివరీనే చేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి రుగ్మతలు లేని మహిళలకు కాన్పులు చేయడం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర దీర్ఘకాలిక రోగాలు కల్గిన వారిని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు జరుపుకోవడం తల్లి పిల్లలకు క్షేమంగా ఉంటారని తెలిపారు. ప్రైవేట్‌లో ఎక్కువ శాతం ఆపరేషన్లకే మొగ్గ చూపుతారని వివరించారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పటోళ్ల సామ్యారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీజేపీ శ్రేణులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సివిల్ సప్లయి గోదాంల్లో ఎన్నో ఏళ్లుగా కార్మికులు వెట్టిచాకిరి చేస్తున్నారని వారికి న్యాయం చేయాలని పోరాటం చేస్తుంటే అధికార పార్టీ తమను అరెస్టులు చేయడం బాధకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒకటి అర తప్పిస్తే పేదలకు లబ్ధిచేసే పథకాలు అమలు లేదని విమర్శించారు. కూలీల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని, గోదాంల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రలింగం, మైపాల్, మైపాల్, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతలను బైండోవర్ చేసిన పోలీసులు

‘తెల్ల’బోయిన జొన్నసాగు

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి
- కర్నాటక నుంచి జొన్నల దిగుమతి

దౌల్తాబాద్: మండల పరిధిలోని తెల్లజొన్న సాగు గణనీయంగా పడిపోయింది. దీంతో రొట్టెలు తినే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో జొన్నసాగుపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. అంతారం, దౌల్తాబాద్, మామిడికుంట, నందారం, యాంకి, ఈర్లపల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామల్లో రైతులు జొన్నను అధికంగా సాగుచేసేవారు. రెండేళ్ల క్రితం మండలంలో సుమారు 500 ఎకరాలకుపైగానే జొన్నను సాగు చేశారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో జొన్నసాగు చేసిన రైతులకు పెట్టుబడి కూడావచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో జొన్న సాగుచేయడం తగ్గించారు. గతేడాది 200 ఎకరాల్లో జొన్న పంటసాగు చేయగా ఈసారి అది 100 ఎకరాలకు చేరింది.

కర్ణాటక నుంచి దిగుబడి

మండలంలోని వ్యాపారులు సమీప కర్ణాటక నుంచి జొన్నలను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కర్ణాటక రైతులు ఎంతో లాభపడుతున్నారు. ప్రస్తుతం జొన్నలు క్వింటాలుకు రూ.3500లకు పైగా పలుకుతుంది. జొన్నల ధరలు అధికంగా ఉండటంతో రొట్టెలు తినే ప్రజలు తమ ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు.



గోకఫసల్‌వాద్ గ్రామ శివారులో సాగు చేసిన జొన్నపంట

గంజాయి నివారణకు కృషి



దౌల్తాబాద్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

దౌల్తాబాద్: గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ రవిగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని గోకఫసల్వాద్ ఉన్నత పాఠశాలలో అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా చేసే వారు. పిల్లలను బానిసలుగా మారుస్తారని అన్నారు. వెట్టిచాకిరి చేయించి వ్యభిచారంలోకి దించి, సెక్స్‌వర్కర్లుగా మారుస్తారని తెలిపారు. కావునా, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే 1098, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు.

ఇతరుల హక్కులను హరించొద్దు



పౌరహక్కుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కుల్కచర్ల: ఏ ఒక్కరూ ఇతరుల హక్కులను హరించడానికి వీలులేదని తహసీల్దార్ మురళీధర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతీ పౌరుడికి హక్కులు కల్పించిందన్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా రాజ్యాంగంలో పొందిపర్చిన అన్ని హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలందరూ కుల, మతభేదాలకు తావు లేకుండా జీవించాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో కలిసిమెలసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం భవన నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

ధారూరు: మాజీ ఎంపీపీ జె.విజయలక్ష్మి, భర్త జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, బుధవారం రెడ్డి సంఘం భవన నిర్మాణానికి విరాళం అందజేశారు. వికారాబాద్ మండల పరిధిలోని రాళ్లచిట్టెంపల్లి గ్రామంలో నిర్మించనున్న రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ.లక్ష అందజేశారు. మాజీ ఎంపీపీ దంపతులకు రెడ్డి సంఘం నాయకులు దివాకర్‌రెడ్డి, సీతారాంరెడ్డి అభినందనలు తెలిపారు.

మంచి సేవలందిస్తేనే గుర్తింపు

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

పరిగి: విధులు మంచిగా నిర్వహిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలిక వసతి గృహంలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తూ బుధవారం పదవీ విరమణ పొందుతున్న చంద్రకళను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డెన్‌గా విధులు నిర్వహిస్తూ ఎంతో మంది పేద విద్యార్థులకు దారిని చూపించారన్నారు. ఉద్యోగం అంటేనే సమాజ సేవ అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ జెడ్పీటీసీ హరిప్రియ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఆర్‌పీ రాజ్‌కుమార్

మోమిన్‌పేట: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలని ఆర్‌పి(క్లస్టర్ రిసోర్సు పర్సన్)రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఏన్కతల ఉన్నత పాఠశాలలో నాలుగు మండలాల మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, కోటపల్లిలకు చెందిన తెలుగు పండిత్‌లకు జాతీయ సాధన సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి తెలుగులో రాయడం, చదవడం వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఫలితాల్లో 2021లో రాష్ట్రం 33వ స్థానంలో, జిల్లా 8వ స్థానంలో ఉందని 2024లో ఉపాధ్యాయులు కృషి చేసి మొదటి స్థానంలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓటరు లిస్టులో తప్పులు సవరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సవరించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జానకిరాం చౌహాన్ అన్నారు. బుధవారం తహసీల్దార్ మురళీధర్‌కు ఓటరు జాబితాను సవరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలం కేంద్రంలోని కుల్కచర్ల, ఎత్తుకాల్వ తండా ఓటరు జాబితా ఇబ్బందికరంగా ఉందన్నారు. ఒకే ఓటు రెండు గ్రామాల్లో ఉండటం, రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉండటం, వార్డుల విభజన తదితర పొరపాట్లు ఉన్నాయని, వాటిని సవరించి తప్పులు లేని లిస్టును తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు జెమిని సూర్యకాంతం, నాయకులు మైపాల్, కొండ ఆంజనేయులు, పెంటయ్య, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. బుధవారం కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024కు సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక, ఉన్నత జెడ్పీహెచ్‌ఎస్ స్థాయిలో విద్యార్థులకు నాస్(ఎన్‌ఏఎస్) కాంపిటేటివ్ ఎగ్జామ్ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. బోధన విధానంపై శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బషీరాబాద్: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవాలని బషీరాబాద్ ఎస్‌ఐ రమేష్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో కళాజాత ద్వారా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని హక్కులు, న్యాయవ్యవస్థలోని చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలు పోక్సో, నిర్భయ చట్టాల గురించి తెలుసుకోవాన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అల్తమాస్, ఉపాధ్యాయులు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అంగన్‌వాడీలకు పెయింటింగ్



కొడంగల్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పెయింటింగ్ వేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ పేర్కొన్నా రు. బుధవారం పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి పెయింటింగ్ వేయడం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులతో, ఆహ్లాదంగా మార్చేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు.

◆ నిలిచిపోయిన సర్టిఫికెట్లు

తాండూరు రూరల్: మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న ఆర్‌ఐలు రాజిరెడ్డి, బాల్‌రాజు గత పది రోజుల క్రితం రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో కార్యాలయంలో పలు సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయాయి. వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు అధికారులు లేకపోవడంతో నిరాశతో వెళ్లిపోతున్నారు. కులం, ఆదాయం, కళ్యాణలక్ష్మి పలు సర్టిఫికెట్లు నిలిచిపోయాయి. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్‌ను వివరణ కోరగా... ఇద్దరు ఆర్‌ఐలో పాటు సర్వేయర్ బదిలీపై వెళ్లినట్లు చెప్పారు. సర్వేయర్ శ్రీహరి డిప్యూటేషన్‌పై వెళ్లారని.. బదిలీ అయిన ఇంకా రిలీవ్ కాలేదని చెప్పారు.

◆ బోరు మోటారు ఏర్పాటు

పరిగి: గత మూడు సంవత్సరాలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో సమస్య పరిష్కారమైందని రాపోలు గ్రామ నాయకులు కలీం, వెంకటేష్ సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో నూతనంగా బోరు మోటారును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోరు మోటారు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

◆ సామర్థ్యం పెంచేలా బోధన

పెద్దేముల్: విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేలా విద్యాబోధన జరగాలని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు కాంప్లెక్స్ సమావేశంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇక్కడ నేర్చుకున్న మెలకువలు, సామర్థ్యాలు పిల్లలలో రాబట్టేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం సునిత, జోజప్ప, ఆర్‌పీలు బందెప్ప, నర్సిరెడ్డి, రమేష్, ప్రియాంక తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ మన్ననలు పొందాలి

బొంరాస్‌పేట: ప్రతి ఉద్యోగి తన పదవి కాలంలో అందించే సేవలు విరమణ అనంతరం కూడా మన్ననలు పొందేలా ఉండాలని తాండూరు విద్యుత్ శాఖ డీఈ భానుప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లారెడ్డి 20 ఏళ్లుగా ఉద్యో గం చేసి బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈ నవీన్‌కుమార్, ఏఈ నాగరాజు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

◆ మొక్కలు నాటిన విద్యార్థులు

బొంరాస్‌పేట: ప్రభుత్వం చేపట్టిన ‘స్వచ్ఛదనం.. పచ్చదనం’ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని టేకులగడ్డతండా ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. చెట్లు, పర్యావరణంపై అవగాహన కల్పించారు.